క్లుప్తంగా

7న కొత్తూరు ఆలయం మూసివేత



కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి గాలిగోపురం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈనెల 7న మూసివేస్తున్నట్లు ఈఓ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేసి సోమవారం ఉదయం 5 గంటలకు తిరిగి తెరుస్తామని వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ



పేదలకు ఆహారం అందిస్తున్న మైనార్టీ యువకులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంకు చెందిన మైనార్టీ యువకులు శుక్రవారం మిలాద్–ఉన్–నబీ పండుగను పురస్కరించుకొని పేదలకు ఆహారం పంపిణీ చేశారు. పాణ్యం బస్టాండ్, రైల్వేస్టేషన్లన్ నంద్యాల బస్టాండ్‌లో సుమారు 200 మందికి పైగా పేదలకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో మైనారీ నాయకులు బాబీ, సయ్యద్ ఉసేన్ బాషా ఖాద్రి, నిరంజన్, జహీర్‌బాషా, షేక్షావలి, ఫారూక్, యూనిస్, జావీద్, సాధిక్, హమీద్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



ఎమ్మార్పీఎస్ జెండావిష్కరిస్తున్న రాష్ట్ర నాయకుడు ఆంధ్రయ్య

కోడుమూరు రూరల్: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రయ్య మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల పోరాటంలో ఎంతో మంది బలిదానాలు, ఆత్మహత్యలు, నిర్బంధాల నడుమ ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సప్పాగు నాగేష్, నాయకులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో అలసత్వం వహించొద్దు



ఆర్ఎస్‌కేకు వచ్చిన యూరియాను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: రైతులకు యూరియా పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని, ఏమాత్రం అలసత్వం వహించరాదని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం వచ్చిన యూరియా బస్తాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణీ జాబితా ప్రకారం జరగాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా అందరికీ అందేలా చూడాలన్నారు. అధికారుల సమక్షంలో పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం పాణ్యం సచివాలయం–3కి వచ్చిన యూరియా బస్తాలను పోలీసుల సమక్షంలో పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం వెలికితీత



గుర్తు తెలియని మహిళ మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న మహిళ మృతదేహాన్ని స్థానికుల సాయంతో పోలీసులు వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. కెనాల్ పైభాగం నుంచి మృతదేహం నీటిలో కొట్టుకుపోతుండగా గణేష్ నగర్ శివాలయం వద్ద స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండి 4.5 అడుగుల ఎత్తు, నల్లని వెంట్రుకలు ఉన్నాయి. పసుపు రంగు చీర, ఆకుపచ్చ కలర్ జాకెట్ ధరించింది. ఆచూకీ తెలిసినవారు 94404 20901 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏఎస్ఐ ఓబులేసు కోరారు.

డేంజర్ ఫుడ్!

- నాణ్యత లేని చిరుతిండ్లతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారులే లక్ష్యంగా రకరకాల స్నాక్స్ ప్యాకెట్లు
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కనీస తనిఖీలు కూడా చేయని అధికారులు



గడివేములలోని ఓ దుకాణంలో విక్రయిస్తున్న చిరుతిండ్ల ప్యాకెట్లు

గడివేముల: నాణ్యత లేని చిరుతిండ్లతో చిన్నారులకు ముప్పు పొంచి ఉంది. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై కొనుక్కొని తినడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. వ్యాపారస్తులు చేసే జిమ్మిక్కులకు తోడు పిల్లలను ఆకట్టుకునేలా కార్టూన్ బొమ్మలు, రంగురంగుల ప్యాకింగ్‌లలో చిరుతిండ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వల్ల భవిష్యత్‌లో పెను ముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు

ధనార్జనే ధ్యేయంగా సకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తాయి. చూడగానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. దుకాణాల్లో విచ్చలవిడిగా ప్యాకెట్ల దండలు వేలాడతీసి అమ్ముతున్నారు. వీటికి సంబంధించి మండలంలో ప్రతిరోజూ వేలాది రూపాయల వ్యాపారం జరుగుతోందనేది నగ్నసత్యం. వీటిపై కనీస తనిఖీలు లేకపోవడంతో ఎవరి ఇష్టం వారిది అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

నాసిరకం చిరుతిండ్లతో రోగాలు

నాసిరకం చిరుతిండ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ చిరుతిండ్లు ఎక్కువ రోజుల నిల్వ ఉండాలనే ఉద్దేశంతో వాటిలో వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పౌడర్లు కూడా వినియోగిస్తున్నారు. వీటిని తినడం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవు.

– డాక్టర్ కిరణ్‌కుమార్, గడివేముల

అవగాహన కల్పించాలి



ముందుగా ఇళ్లలో, ఆ తర్వాత పాఠశాలల్లో పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు అందకుండా నివారించాలి. సహజ సిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమేడ్ వాటి జోలికి వెళ్లకుండా పిల్లల్ని ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి, చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేలా పాఠశాలల్లో అవగాహన కల్పించాలి.

– డి.యాసిన్, గడివేముల

చిరుతిండ్లకు దూరంగా ఉండాలి



నాణ్యత లేని చిరుతిండ్లు చిన్నారులే కాదు పెద్దలు కూడా తినకూడదు. పిల్లలు మారం చేయడం వల్ల తల్లిదండ్రులు ఇష్టం లేకపోయినా వాటిని పిల్లలకు కొనిస్తున్నారు. అలా చేయడం వలన చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. అహార పదార్థాల అమ్మకాల్లో నిబంధనలు పాటించని వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, ఉప సర్పంచ్, గడిగరేవుల

26 మంది ఉల్లి వ్యాపారుల లైసెన్స్ రద్దు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఉల్లిగడ్డల కొనుగోలు లైసెన్స్‌లు పొంది కీలకమైన సమయంలో కొనుగోలు చేయకుండా ధరల పతనానికి కారణమైన వ్యాపారుల లైసెన్స్‌లను సస్పెండ్ చేస్తూ చైర్మన్ గోల్కొండ అజ్మత్‌బీ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ నుంచి 36 మంది వ్యాపారులు ఉల్లిగడ్డల కొనుగోలుకు లైసెన్స్‌లు పొందారు. ఆగస్టు నెలలో మార్కెట్‌కు వచ్చిన ఉల్లిగడ్డలను 26 మంది వ్యాపారులు కొనుగోలు చేయలేదు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ తగ్గిపోవడం వల్ల ధరలు పడిపోయాయి. ఈ వ్యవహారంపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉల్లి కొనుగోలు చేయని 26 మంది వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేశారు.

7న ఎల్లమ్మ ఆలయం మూసివేత

కర్నూలు (రూరల్): చంద్ర గ్రహణం కారణంగా ఈ నెల 7వ తేదీన వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం తలుపులు మూసివేయనున్నట్లు శుక్రవారం ఈఓ ఎస్.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 7న ఆదివారం రాహు గ్రహ సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా మధ్యాహ్నం 12 నుంచి అమ్మవారి ఆలయ తలుపులు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రహణం వీడిన తర్వాత 8న సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు ఆలయం తలుపులు తెరిచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రాతఃకాల పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించడం జరుగుతుందని వెల్లడించారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం నిర్మలా వసంతకుమారి

ఓర్వకల్లు: సమసమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని హెచ్‌ఎం నిర్మలా వసంత కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు సీనియర్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థులకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సి.బెళగల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలయ్య అన్నారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నటేకూరు ఐఐటీ/నీట్ అకాడమీ మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డిని పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి స్థాయి పరిహారమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఓర్వకల్లు: ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారమివ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఏపీఐఐసీ పేరుతో మండలంలో వేల ఎకరాల భూములను పరిశ్రమల స్థాపనకు తీసుకున్నారన్నారు. అయితే, బాధిత రైతులకు నామమాత్రపు పరిహారం చెల్లించారన్నారు. భూసేకరణ సమయంలో మీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని, భవిష్యత్ బాగుంటుందని నమ్మబలికి మోసం చేశారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఏపీఐఐసీలో కోల్పోయిన రైతులకు ఎవరెవరికి ఎంత పరిహారం వచ్చిందనే కోణంలో విచారణ జరిపి, అన్యాయం జరిగిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు మద్దిలేటి, రామకృష్ణ, అన్నయ్య, కృష్ణుడు, మద్దిలేటి, బాధిత రైతులు, మహిళ రైతులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: మద్యం మత్తులో కేసీ కెనాల్‌లో దూకి 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతిచెందాడు. వినాయక ఘాట్ సమీపంలోని గ్రీన్ పార్కు బార్ వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి కేసీ కెనాల్‌లోకి దూకాడు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. అయితే నీళ్లలో మునిగిపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ ఏఎస్ఐ ఓబులేసు అక్కడికి చేరుకుని నీటిలో మునిగిపోయిన మృతదేహాన్ని యువకుల సహాయంతో వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడు 5.2 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ వర్ణం కలిగి ఉన్నాడు. అతనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రైతులకు కూటమి ప్రభుత్వం దగా



మాట్లాడుతున్న ఎంపీపీ, పార్టీ మండల కన్వీనర్, నాయకులు

గడివేముల: కూటమి సర్కారు రైతులను దగా చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంతల మధుసూదన, ఎంపీపీ నాగమద్దమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రం నుంచి వచ్చిన యూరియాను అధికార పార్టీ నాయకులు పంచుకుంటున్నారని ఆరోపించారు. తప్పని పరిస్థితిలో రైతులు బ్లాక్‌మార్కెట్‌లో యూరియాను కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రైతులకు యూరియా అందించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నంద్యాల ఆర్డీఓను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ రైతు పక్షాన నిలిచి పోరాడుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు అవసరమైన యూరియా అందించలేక ఎక్కువగా వాడొద్దని.. రోగాలు వస్తాయని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యూరియా కొరతపై సోషల్ మీడియాలో కామెంట్లు పెడితే కేసులు పెడతామని బెదిరించడం సరి కాదన్నారు. ప్రైవేట్ డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయించడంతోపాటు ఇతర ఎరువులను అంటగట్టడంతో రైతన్నలు అప్పుల పాలవుతున్నారన్నారు. వర్షాలు అధికంగా పడడంతో పంటలకు యూరియా చల్లితేనే మంచి దిగుబడులు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రెండేళ్లకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఎన్నికల ముందు ఏటా రూ. 20 వేలు ఇస్తామని చంద్రబాబు నమ్మించి అధికారంలోకి వచ్చాక దగా చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖర రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, రఘు మాధవరెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



సి.బెళగల్ జామియా మసీదు నుంచి ర్యాలీగా వెళుతున్న ముస్లింలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పండుగ పురస్కరించుకుని మదరాసా ఆవరణలో అన్నదానం చేపట్టిన ముస్లింలు, సాయంత్రం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తెలుగు వీధిలోని జామియా మసీద్ నుంచి చిన్నారులు జెండాలు చేతబట్టి పెద్ద ఎత్తున ర్యాలీ పాల్గొన్నారు. అదేవిధంగా కొత్త బస్టాండ్ దగ్గరున్న మదీనా మసీదు నుంచి ముస్లింలు అల్లా అక్బర్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, వేడుకలను ఘనంగా ముగించారు.

పాణ్యం: మండలంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం పాణ్యంలోని ఆసారే షరీఫ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రవక్త తలనీలాలను ప్రదర్శించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వాటిని తిలకించారు. కార్యక్రమంలో ఆసారే షరీఫ్ నిర్వాహకులు, పీఠాధిపతి తదితరులు పాల్గొన్నారు.

పుడమికి పచ్చని తివాచీ



జి.సింగవరంలో కనుచూపు మేర వరి పైరు

కర్నూలు(రూరల్): మండల పరిధిలో కె.సి.కెనాల్, తుంగభద్ర నది ఆయకట్టు కింద మునగాలపాడు, నిడ్జూరు, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు, బావాపురం, సుంకేసుల, పూడూరు, పడిదెంపాడు, నూతనపల్లె, సూదిరెడ్డి పల్లె, వెంకాయపల్లె తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో ఎటు చూసినా పచ్చని వరి పంటపొలాలు కనుచూపు మేర కనువిందు చేస్తున్నాయి. ఈ ఏడాదైనా వరి మంచి దిగుబడులు వచ్చి గిట్టుబాటు ధర లభించాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కమ్మని రుచితో కష్టం బలాదూర్



మధ్యాహ్న సమయంలో భోజనం చేస్తున్న చేస్తున్న కూలీలు

మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామ సమీపంలో ఉల్లి పంటలో కలుపు తీసేందుకు వచ్చిన కూలీలు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పొలం గట్టుపై ఉన్న చెట్టు నీడలో కూర్చొని భోజనం ఆరగించారు. ఇంటి నుంచి తెచ్చుకున్న క్యారియర్లలోని ఆహారం, కూరలను ఒకరికొకరు పంచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ అప్పటివరకు చేసిన కష్టాన్ని మరచి కమ్మగా భోజనం చేశారు. చల్లటి నీడలో వారి ముచ్చట్లు, గుంపుగా కూర్చొని భోజనం చేసే విధానాన్ని చూస్తే ఎవరికైనా 'కమ్మని రుచితో కష్టంతో బలాదూర్' అనిపించక మానదు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉల్లి పంటలో కలుపుతీస్తే కూలి రూ.300 వస్తుందని వారు తెలిపారు.

– కర్నూలు(రూరల్)

భూపనపాడులో ఇరుక్కున యూరియా లారీ

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో యూరియాతో వచ్చిన లారీ మలుపు వద్ద ఇరుక్కుపోయింది. దీంతో అధికారులు యూరియా బస్తాలను ట్రాక్టర్ల సహాయంతో ఆర్ఎస్‌కేలకు పంపించా రు. కొద్ది సేపటికే లారీ బయటకు రావడంతో మిగిలిన బస్తాలను అక్కడికి తరలించారు.. గ్రా మానికి మొత్తం 532 బస్తాలు వచ్చినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

అడుగడుగునా గుంతలే!



జి.సింగవరం వద్ద కంకర తేలిన రోడ్డు



బావాపురం సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



నిడ్జురు గ్రామ సమీపాన రోడ్డుపై గుంతలు

కర్నూలు(రూరల్): కూటమి ప్రభుత్వం గత జనవరి నాటికే రోడ్లన్నింటినీ అద్దాల్లా మారుస్తామంటూ ఆర్భాటంగా ప్రకటన చేసింది. అయితే కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేక చేతులెత్తేసింది. అధికారం చేపట్టి 15 నెలలు దాటినా రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా గుంతలు పడిన రహదారుల్లో ప్రయాణం చేసేందుకు ప్రజలు జంకుతున్నారు. గుంతల్లో కనీసం తట్ట మట్టి పోసిన దాఖలాలు లేవు. రోడ్లను బాగుచేసేందుకు అధికారులు కనీసం ప్రాతిపాదనలు కూడా తయారు చేయక పోగా పాలకులు రోడ్ల గురించి ఎప్పుడో మరచిపోయారు. కర్నూలు నుంచి సుంకేసుల దాదాపుగా 27 కి.మీ ఉన్న ఆర్అండ్‌బీ రహదారిపై నిడ్జూరు గ్రామ సమీపం నుంచి చింతమాడ టర్నింగ్, బావాపురం ఆర్చ్ వరకు దాదాపు కి.మీ మేర రోడ్డుపై అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. రహదారిపై అడుగుకో గొయ్యి, గజానికో గుంత ఉండటంతో రాకపోకలు సాగించే వారు నరకం చూస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని. వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు మొత్తం కంకర లేచి ప్రమాదకరంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి బైకర్లు గాయలపాలవుతున్నారు. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు, కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నడి రోడ్డుపై గుంతలు



కోడుమూరు బస్టాండ్ వద్ద రోడ్డు దుస్థితి

కోడుమూరు రూరల్: కోడుమూరు ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, ఎమ్మిగనూరు మార్గంలో నడి రోడ్డుపై భారీగా గుంతలేర్పడ్డాయి. గుంతలను పూడ్చి సకాలంలో మరమ్మతులు చేయాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారీన పడుతున్నారు. పగటి వేళ ఎలాగోలా గుంతలను గమనించి వాహనదారులు జాగ్రత్త పడుతున్నా, రాత్రి సమయంలో గుంతలను గమనించకుండా వెళ్లి ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును బాగు చేయాలని కోరుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ తూతూమంత్రంగా పనులు చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.